సాక్షి అనకాపల్లి

శనివారం । 6 । ఏప్రిల్ । 2024



నూకాంబిక పూలరథం

అనకాపల్లి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమయింది. IIలో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదురోజులు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఓ ప్రకటలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 37.2, కనిష్టంగా 35.8 డిగ్రీలు, తేమ 68 నుంచి 75 శాతం, గాలి గంటలకు 2 నుంచి 3 కి.మీ.వేగంతో వీస్తుందన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
అనకాపల్లి	6.15	4.33
నర్సీపట్నం	6.18	4.31

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

- పాల్గొననున్న వైవీ సుబ్బారెడ్డి

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో శనివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యుడు, ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఉప ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పాల్గొంటారని పేర్కొన్నారు.

పాయకరావుపేటలో పార్టీ కార్యాలయం ప్రారంభం నేడు

నక్కపల్లి: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి శనివారం పాయకరావుపేటలో పర్యటించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ పాయకరావుపేటలో ముందుగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం ఇంటింటా ఎన్నికల ప్రచారంలో సుబ్బారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రచారం ముగిశాక పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారని, రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. సుబ్బారెడ్డితోపాటు మరో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ప్రధాన నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.



మునగపాక మండలం మూలపేటలో వికలాంగ పింఛన్ అందజేస్తున్న సచివాలయ కార్యదర్శి శివ

● వచ్చేది మన ప్రభుత్వమే...

పండుటాకులకు మళ్లీ పండగే..

- వలంటీర్ల సేవలు ఆగవని సీఎం జగన్ స్పష్టీకరణ
- ఆయన తొలి సంతకం ప్రకటనపై సర్వత్రా హర్షం
- ఊరట చెందుతున్న అవ్వా తాతలు, దివ్యాంగులు
- మళ్లీ ఇంటికే పెన్షన్లు అందుతాయంటూ సంబరం
- ప్రభుత్వ చొరవతో ముగింపు దశకు చేరుకున్న పింఛన్ల పంపిణీ

సాక్షి, విశాఖపట్నం : గత 58 నెలల నుంచి వలంటీర్లే వచ్చి ఇళ్ల వద్దనే పెన్షన్లు ఇచ్చారు.. ఒకటో తేదీ సూర్యోదయానికి ముందే పెన్షను సొమ్ము వారి చేతిలో పెట్టేవారు.. పిసరంత కష్టం లేకుండా రూ.3 వేలు అందుకుంటున్న అవ్వా, తాతలు, దివ్యాంగుల కళ్లలో ఆనందానికి అవధులు ఉండేవి కావు.. ఈ వ్యవస్థ సాఫీగా కొనసాగుతుండగా చంద్రబాబు కుటిల రాజకీయం వీరి పాలిట శాపంగా మారింది. వీరికి వలంటీర్లు పెన్షను సొమ్ము ఇవ్వకుండా అడ్డుపడ్డారు. వలంటీర్ల వ్యవస్థకు తాత్కాలికంగా బ్రేకులు వేశారు. వడగాడ్పులు వీస్తున్న ప్రస్తుత తరుణంలో అష్టకష్టాలు పడుతూ సచివాలయాలకు మరొకరిని వెంటబెట్టుకుని వెళ్లి పింఛను తీసుకోవలసిన పరిస్థితి దాపురించింది. ఆటోలకు రానుపోను చమురు వదిలించుకోవలసి వస్తోంది. దీనికంతటికీ కారణం చంద్రబాబు అండ్ కో అని తెలుసుకున్న పండుటాకులు, దివ్యాంగులు తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రజల సంక్షేమం కోరుకునే వారే నిజమైన పాలకులు, ప్రజా సేవకులు అవుతారు తప్ప ఇలా తిప్పలు పెట్టేవారు కాదంటూ నిప్పులు చెరుగుతున్నారు. ఇలాంటి తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన వీరికి ఎంతో ఊరటనిచ్చింది.

వలంటీర్ల వ్యవస్థ కొనసాగుతుందని, వారి సేవలు ఆగవని, యథావిధిగా వాళ్లే ఇంటింటికి పెన్షను తెచ్చి ఇస్తారని, మళ్లీ అధికారంలోకి వచ్చాక తన తొలి సంతకం ఆ ఫైల్ పైనేనని తిరుపతి జిల్లా నాయుడుపేట బహిరంగ సభలో స్పష్టం చేశారు. దీంతో జగన్ మళ్లీ సీఎం అయ్యాక ఎప్పటిలాగానే వలంటీర్లు ఇంటికే వచ్చి పెన్షను ఇస్తారని అవ్వా తాతలు, దివ్యాంగులు ఎంతో మురిసిపోతున్నారు. ఈ విషయాన్ని వీరు సాటి వారికి చెప్పుకుని తమ సంతోషాన్ని పంచుకుంటున్నారు. మరోవైపు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తానని సీఎం చేసిన ప్రకటనపై వలంటీర్లలోనూ ఆనందం వ్యక్తమవుతోంది.

శరవేగంగా పింఛన్ల పంపిణీ

వృద్ధులు, దివ్యాంగుల కష్టాలను ముందుగానే గుర్తించిన ప్రభుత్వం సత్వరమే పెన్షన్ పంపిణీకి చర్యలు చేపట్టింది. పెన్షన్ కోసం వచ్చే వారికి ఆలస్యం చేయకుండా వెనువెంటనే సొమ్ము అందజేయాలని సంబంధిత సచివాలయాల సిబ్బందిని ఆదేశించింది. దీంతో బుధవారం మధ్యాహ్నం నుంచి చేపట్టిన పెన్షన్ల పంపిణీ గురువారం నాటికి విశాఖ జిల్లాలో 92.68 శాతం, అనకాపల్లిలో 85.05 శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 75.25 శాతం మందికి అందజేశారు. శుక్రవారం నాటికి విశాఖ జిల్లాలో 95.03 శాతం, అనకాపల్లి జిల్లాలో 93.34 శాతం, అల్లూరి జిల్లాలో 93.71 శాతం మందికి పంపిణీ జరిగింది. మిగిలిన వారికి శనివారం రాత్రి 7 గంటలలోపు చెల్లించనున్నారు. మరోవైపు మంచాన పడిన వారికి, దివ్యాంగులకు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న వారికి సచివాలయ సిబ్బంది నేరుగా వారి ఇంటికి వెళ్లి పెన్షన్ అందిస్తున్నారు.



విశాఖలో బొర్రా లక్ష్మి ఇంటికి వెళ్ల పింఛన్ అందిస్తున్న సచివాలయ కార్యదర్శి వెంకటప్రసాద్

వోలెంట్రీలు లేపోతే కట్టం బాబు



పెతీ నెలా ఇంటి దగ్గిరే పించినీ డబ్బులు తీసుకున్నాను. అది కూడా ఒకటో తేదీనే. అదికూడా వోలెంట్రే మా ఇంటికాడికొచ్చి ఇచ్చీవోలు. ఈసారి మూడ్రోజులు ఆలీసమైనాది. ఏటైనాదా అని ఇరుగూపొరుగుల్ని అడిగితే.. వోలెంట్రీలను ఆపేసినారని తెలిసినాది. ఈ నెల పించినీ డబ్బులు పైడిపాల పంచాతాపీసుకెల్లి తెచ్చుకోవాల్సొచ్చింది. ఎండలో ఎల్లి తీసుకోడానికి సేనా కట్టపడ్డాను. జగన్‌బాబొత్తే మళ్లీ వోలంట్రీలను పెడతానని సెప్పడం మాలాటి ముసలీముతకోళ్లకి ఆనందం బాబు. లేపోతే పాత రోజుల్లో పడ్డ కట్టం ఈ వయసులో ఇంక పడలేం. వోలోంట్రీలు ఉండాల బాబు.

–బొడ్డు నూకాలమ్మ, వెంకటాపురం, మాకవరపాలెం మండలం

పింఛన్ కోసం రెండు రోజులు తిరిగా..



సీఎం జగన్ ఇచ్చే రూ.3 వేలు నాకు నెలంతా సరిపోతున్నాయి. ఈ వయసులో ఎవరి దగ్గరా చేయి చాచకుండా గౌరవంగా బతుకున్నా. వలంటీర్ ఇంటికొచ్చి ఇవ్వడం మరింత గౌరవంగా ఉండేది. చంద్రబాబు చేసిన పనివల్ల ఈ రెండు నెలలు వలంటీర్ లేకుండా అయ్యింది. మాది గురజాడనగర్. పింఛన్ కోసం హైవే దాటి రేబాకలోని సచివాలయానికి వెళ్లాల్సి వచ్చింది. రెండు రోజులు తిరగాల్సి వచ్చింది. పింఛన్ కోసం అష్టకష్టాలు పడ్డ పాతరోజులు గుర్తొచ్చాయి. మళ్లీ అలాంటి రోజులు చూడాలని లేదు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చాలు.. మాకు అన్నీ మంచిరోజులే.

–బొట్టా రాజులమ్మ, గురజాడనగర్, రేబాక పంచాయతీ, అనకాపల్లి

అందుకే రాజీనామా చేశా..



కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ధైర్యంగా వెళ్లి సేవలందించిన మమ్మల్ని ఎన్నికలను నేపంగా చూపి ప్రతిపక్ష పార్టీలు ప్రజలకు దూరం చేయాలని చూశాయి. ప్రభుత్వం అందించే సంక్షేమాన్ని ఒక వారధిలా ప్రజలకు అందించామే కాని ఎటువంటి రాజకీయం చేయలేదు. అలాంటిది మాపై టీడీపీ, జనసేన పార్టీలు నేరారోపణలు చేస్తూ మొదట్నుంచీ దూషిస్తునే ఉన్నాయి. రెండు నెలల తరువాత మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే. అందుకే రాజీనామా చేశా.

–ఎం.రాముడు, పూర్వ వలంటీర్, జిల్లేడుపూడి, నాతవరం మండలం

మళ్లీ సేవ చేసే భాగ్యం



గ్రామ వలంటీర్ల వ్యవస్థను కొనసాగించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భరోసా ఇవ్వడం ఎంతో ఆనందదాయకం. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి సేవలందించే ఫైలు పైనే తొలి సంతకం చేయనున్నట్లు సీఎం ప్రకటించి వలంటీర్లు అందిస్తున్న సేవలపై విశ్వాసం చూపడం ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. ప్రజలకు దీర్ఘకాలం విస్తృతంగా సేవలందించే అవకాశం కల్పించనున్నందుకు కృతజ్ఞతలు.

–బి.నిఖిత, గ్రామ పూర్వ వలంటీర్, కశింకోట

అక్రమ వ్యాపారం... అధికారులపై దౌర్జన్యం...

- నాణ్యమైన సరుకు చూపి నాసిరకం అందించడం వారి నైజం
- జీఎస్టీ చెల్లించకుండానే డెలికేట్ టైల్స్, మార్బుల్స్ విక్రయం
- అధికారులను లొంగదీసుకునేందుకు రాజకీయ నేతల అండ
- ఆశ చూపి పనిచేయించుకుని ఎమ్మార్వో, ఆర్‌ఐలను ఏసీబీకి పట్టించిన ఘన చరిత్ర
- లంచం అడుగుతున్నారంటూ పంచాయతీ కార్యదర్శిపైనా అబద్ధపు ఫిర్యాదు
- ఇదీ గాంధీగ్రామంలో ఏర్పాటైన బుచ్చిబాబు ట్రేడర్స్ నిర్వాకం
- వారి అక్రమ వ్యాపారానికి అండదండ అందిస్తున్న కొణతాల
- స్లీపింగ్ పార్టనర్‌గా వ్యవహరిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్.రాజు
- దొంగ వ్యాపారం బయటపడుతుందనే డీఆర్‌ఐ అధికారులపై దౌర్జన్యం
- రూ.25 లక్షలు పట్టుకెళ్లారంటూ అసత్య ఆరోపణ

సాక్షి, అనకాపల్లి: వ్యాపారంలో అక్రమాలకు పాల్పడటం... వాటిని అడ్డుకట్ట వేయడానికి వచ్చే అధికారులపై దౌర్జన్యం చేయడం వారికి అలవాటు. పనులు చేయించుకోవడానికి లంచాలు ఆశచూపడం... తీరా పని పూర్తయ్యాక వారిని ఏసీబీకి పట్టించిన ఘన చరిత్ర వారిది. అంతేనా.. తమ వ్యాపారానికి అడ్డుతగులుతున్న పంచాయతీ కార్యదర్శిపైనా లంచం అడుగుతున్నారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి బ్లాక్‌మెయిల్ చేయగల సమర్థులు. ఇదీ అనకాపల్లి జిల్లా చోడవరం మండలం గాంధీగ్రామంలో గత పదేళ్లుగా డెలికేట్ టైల్స్, మార్బుల్స్ విక్రయాలు సాగిస్తున్న బుచ్చిబాబు ట్రేడర్స్ వ్యవహార శైలి. ప్రభుత్వానికి జీఎస్టీ చెల్లించకుండా ఎగ్గొట్టి మార్కెట్‌లో రెండో రకం టైల్స్, మార్బుల్స్‌ను దొడ్డి దారిలో విక్రయించడం వీరి వ్యాపారం. రెండో రకం మార్బుల్స్, టైల్స్ తీసుకొచ్చి ఒరిజినల్ అని వినియోగదారులను మోసం చేయడం వారికి నిత్యకృత్యం. తమ వద్ద ఒరిజినల్‌తోపాటు మరో రెండు రకాల డూప్లికేట్ టైల్స్, మార్బుల్స్ అందుబాటులో ఉంచుతారు. వినియోగదారుడికి శాంపిల్‌గా ఒరిజనల్ చూపించి.. స్టాక్ పంపించే సమయంలో డూప్లికేట్ సరుకు పంపిస్తారన్న ఆరోపణలు కూడా వీరికి ఉన్నాయి. దీర్ఘకాలికంగా మిగిలిపోయిన స్టాక్‌ను తక్కువ ధరకు కొనుక్కొని వచ్చి ఇక్కడ అధిక ధరకు విక్రయించే అలవాటు వారిది. జీఎస్టీ ఎగ్గొట్టి అక్రమ వ్యాపారాన్ని సాగించడంతో సహచర వ్యాపారులు చేసిన ఫిర్యాదు మేరకు డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం(డీఆర్‌ఐ) అధికారులు గురువారం తనిఖీ చేశారు. వారిపైనా రాజకీయ అండతో దౌర్జన్యానికి దిగడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది.

రాజకీయ నేతల సాన్నిహిత్యంతో యథేచ్ఛగా అక్రమాలు

బుచ్చిబాబు ట్రేడర్స్‌ది మొదటినుంచీ అక్రమ వ్యాపారమే. వారికి మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ మొదటినుంచీ అండగా నిలుస్తున్నారు. అంతేగాదు. మాజీ టీడీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్.రాజు వీరి వ్యాపారంలో భాగస్వామి. రాజకీయ సాన్నిహిత్యాన్ని అడ్డుపెట్టుకుని జీఎస్టీని ఎగ్గొట్టి యథేచ్ఛగా వీరు అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. పైగా వీరి అక్రమం బయటపడుతుందనే డీఆర్‌ఐ అధికారులపై ముందస్తుగా దౌర్జన్యానికి పాల్పడ్డారు. అంతేకాకుండా రూ.25 లక్షలు తీసుకెళ్లారని డీఆర్‌ఐ అధికారులపై అభాండాన్ని వేశారు. పదేళ్ల నుంచి చేసిన మోసాలన్నీ డీఆర్‌ఐ అధికారుల తనిఖీలో బయటపడిపోతాయన్న భయంతోనే గురువారం వారు తనిఖీలు నిర్వహిస్తున్నపుడు తన స్లీపింగ్ పార్టనర్ అయిన చోడవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, తన గురువు కొణతాల రామకృష్ణ, ఎంపీ అభ్యర్థి సీ.ఎం.రమేష్‌లకు ఫోన్ చేసి రప్పించి ఏదోలా దౌర్జన్యం చేసి రైడింగ్ అవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేశారు.

అధికారులను బెదిరించడం వారికి నిత్యకృత్యం

బుచ్చిబాబు ట్రేడర్స్ యజమాని గతంలో చోడవరంలో జరిగిన ఒక భూ వివాదంలో స్థానిక ఎమ్మార్వో, ఆర్‌ఐలకు రూ.3 లక్షలు లంచం ఇస్తానని ఆశ చూపి పని చేయించుకున్నారు. వారికి డబ్బులు ఇస్తానని నమ్మబలికి.. డబ్బులిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులకు తానే సమాచారం అందించి పట్టించేశాడు. ఆ సమయంలో ఎమ్మార్వో కారు డ్రైవర్‌గా తనకు అనుకూలమైన వ్యక్తిని ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. అది జరిగిన కొన్నాళ్లకు తనకు పంచాయతీ సెక్రటరీ ఇబ్బంది పెడుతున్నారనీ, లంచం అడుగుతున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు.

ఇలా అక్రమాలకు పాల్పడడం.. అడ్డొచ్చిన అధికారులను బ్లాక్‌మెయిల్ చేసి వారి ఉద్యోగాలకు ఎసరు పెట్టడం వారికి పరిపాటిగా మారింది. అందుకే వారి అక్రమవ్యాపారం పదేళ్లుగా యథేచ్ఛగా సాగిపోతోంది.

రాజకీయ లబ్ధి కోసం ఇంత బరితెగిస్తారా?

- పన్నులు కట్టని దుకాణంపై అధికారులు దాడులు చేస్తే తప్పేంటి?
- అక్రమ వ్యాపారులకు కొమ్ముకాస్తున్న సి.ఎం.రమేష్
- మీరు తప్పులు చేసి నాపై ఆరోపణలు చేస్తే సహించను
- ధ్వజమెత్తిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



విలేకరుల సమావేశం ఎమ్మెల్యే ధర్మశ్రీ

చోడవరం: వ్యాపారులు పన్నులు ఎగ్గొడితే సంబంధిత శాఖాధికారులు దాడులు చేసి జరిమానాతో సహా కట్టించడం వారి విధి నిర్వహణలో భాగం.. గతంలో చట్టసభలకు ప్రాతినిధ్యం వహించిన సి.ఎం.రమేష్, కె.ఎస్.ఎన్.ఎస్.రాజులకు ఈ విషయం తెలీదా.. రాజకీయ లబ్ధి కోసం ఇంత బరితెగిస్తారా.. అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రతిపక్ష నేతలకు నిలదీశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తప్పులు చేయడంతో అధికారులు తనిఖీకి వచ్చారని, అది తానే చేయించానని దుష్ప్రచారం చేయడం సరికాదని అన్నారు. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఆడలేక మద్దెల ఓడన్నట్టు వారు చట్టాన్ని అతిక్రమించి, తాను బెదిరించానని, డబ్బు అడిగానని చెప్పి, అందరి దృష్టి మరల్చాలని చూస్తున్నారన్నారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

మీ లొసుగులు అందరికీ అర్థమయ్యాయి

ట్యాక్స్ అధికారులు తనిఖీలకు వస్తే తమ వద్ద ఉన్న రికార్డులను చూపించాలి కానీ టీడీపీ, బీజేపీ నేతలకు ఫోన్లు చేసి రప్పించుకోవడం ఏమిటని ధర్మశ్రీ ప్రశ్నించారు. వ్యాపారంలో ఏదో మతలబు ఉందన్న విషయం దీంతో అందరికీ అర్థమయిందన్నారు. పన్నులు కట్టలేదని అధికారులు తనిఖీలు చేస్తుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన ఒక ఎంపీ అభ్యర్థిని హుటాహుటిన పిలిపించుకొని, ఆయన అనుచరులతో అధికారులపై అనుచితంగా ప్రవర్తించారన్నారు. కడపలో అక్రమ వ్యాపారాలు చేస్తున్న రమేష్.. అతనిలాగే దొంగ సొమ్ము సంపాదించుకోండని తన అనుయాయులకు వత్తాసు పలుకుతున్నారా అని ప్రశ్నించారు. బుచ్చిరాజు ట్రేడర్స్‌లో కొనుగోలు చేసిన ఏ సరకుకు సరైన బిల్లులు ఇవ్వరన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. బీజేపీ, టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బుద్ద గంగరాజు, బైన ఈశ్వరరావు, సర్పంచ్‌లు మళ్ల శ్రీనివాసరావు, ప్రసాద్, నాగులాపల్లి రాంబాబు పాల్గొన్నారు.

బండారుకు ఇస్తే తడాఖా చూపిస్తా..!

- మాడుగులలో పోటీ చేయాలని బండారుకు చంద్రబాబు ఫోన్
- విషయం తెలుసుకొని మండిపడిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్
- బండారు కంటే ముందే మా కుటుంబం రాజకీయాల్లో ఉందన్న పీలా

సాక్షి, విశాఖపట్నం : ఎన్నికల నోటిఫికేషన్‌కు సమయం దగ్గర పడుతున్నా.. కూటమిలో టికెట్ల పంచాయితీ నివురు గప్పిన నిప్పులా రాజుతూనే ఉంది. పొత్తుల ఎత్తులతో జిత్తులమారిలా వ్యవహరిస్తున్న చంద్రబాబు సీనియర్ల సీటుకు ఎసరు పెట్టేశారు. పెందుర్తిలో బండారుకు, అనకాపల్లిలో పీలాకు వెన్నుపోటు పొడిచిన బాబు.. ఇప్పుడు మందు రాసేందుకు చేస్తున్న ప్రయత్నాలు మరింత తలనొప్పిగా మారుతున్నాయి.

మాడుగుల సీటును బండారుకు ఇద్దామన్న సంకేతాలు వినిపిస్తుండటంతో మరో సీనియర్ పీలా మండిపడుతున్నారు. తనని కాదని బండారుకు సీటెలా ఇస్తారో చూస్తానంటూ అధిష్టానానికి సవాల్ విసురుతున్నారు.

మాడుగులలో బండారు పోటీపై సర్వే

పొత్తులో భాగంగా పెందుర్తి సీటును జనసేన అభ్యర్థి పంచకర్లకు కట్టబెట్టడంతో బండారు సత్యనారాయణ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. బయటకు టీడీపీతోనే పయనమని చెబుతున్నా.. పంచకర్లకు సహకరించకుండా తటస్థంగా ఉండిపోతారన్న వార్తలు వస్తుండటంతో.. సర్దుబాటు చేసే ప్రయత్నాల్ని చంద్రబాబు ప్రారంభించారు. మరోవైపు అనకాపల్లి సీటును కూడా జనసేనకు త్యాగం చేయడంతో అక్కడ మాజీ ఎమ్మెల్యే పీలా వర్గం రగిలిపోతోంది. పీలాని పిలిచి.. బుజ్జగించి.. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో అసంతృప్తులకు చెప్పిన ఎమ్మెల్సీ మంత్రాన్ని జపించడంతో.. బాబు మాటలు నమ్మి స్తబ్దుగా ఉందామని పీలా భావించారు. కానీ.. ఇంతలోనే మరో వార్త పీలా వర్గానికి మింగుడు పడకుండా చేస్తోంది. సీట్ల మార్పులో భాగంగా.. మాడుగుల టికెట్‌ని బండారుకు ఇస్తే ఎలా ఉంటుందన్న సర్వేలు, జిల్లా టీడీపీ నేతల అభిప్రాయాల్ని అధిష్టానం సేకరిస్తున్నట్లు సమాచారం. మరోవైపు.. మాడుగులలో పోటీ చేయాలని బండారుకు చంద్రబాబు నుంచి ఫోన్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయం ఆ నోటా ఈ నోటా నానుతూ పీలా గోవింద్ సత్యనారాయణ చెవిలో పడటంతో సీన్ రివర్స్ అవుతోంది.

మా కుటుంబమే రాజకీయాల్లో ముందు

చంద్రబాబు వైఖరిపై పీలా గోవింద్ మండిపడుతున్నారు. సీటు ఇవ్వకుండా మోసం చేయడం ఒక ఎత్తయితే.. తన జిల్లాలో తనకు కాకుండా ఇంకొకరికి సీటు ఎలా ఇస్తారంటూ అధిష్టానం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లిలో సీటు ఆశించి భంగపడ్డ తనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వకుండా బండారుకు ఎలా ఇస్తారంటూ చంద్రబాబుని పీలా ప్రశ్నిస్తున్నారు. అసలు రాజకీయాలు బండారు ఇంట్లో ముందు పుట్టాయా..? మా ఇంట్లో ముందు పుట్టాయా అంటూ టీడీపీ శ్రేణుల వద్ద పీలా ఆక్రోశం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. బండారు నుంచి వారి కుటుంబంలో రాజకీయాలు మొదలయ్యాయి.. మా తాతల కాలం నుంచి మా ఇంట్లో రాజకీయాలు ఉన్నాయి. అలాంటప్పుడు తనని కాదని వేరే వాళ్లకు టికెట్ ఇస్తే సహించేది లేదని.. అధిష్టానానికి పీలా తెగేసిచెప్పినట్లు తెలుస్తోంది.

ఒకవేళ టికెట్ బండారుకే ఇస్తే ఎలా గెలుస్తారో తాను చూస్తానని పీలా సవాల్ విసిరినట్లు సమాచారం. ఇప్పటికే అనకాపల్లి టికెట్ ఇవ్వకపోవడంతో అయోమయంలో ఉన్న పీలా వర్గం.. ఇప్పుడు మరో వెన్నుపోటుతో చంద్రబాబు వైఖరిపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు.

సమతావాది జగ్జీవన్‌రామ్



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: స్వాతంత్ర్య సమరయోధుడు, సమతావాది బాబూ జగ్జీవన్‌రామ్ దేశం గర్వించదగ్గ వ్యక్తి అని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. శుక్రవారం జగజీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత పార్లమెంటులో 40 ఏళ్లపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉపప్రధానిగా దేశానికి మహోన్నత సేవలు అందించారని కొనియాడారు. 1935లో అంటరానితనానికి గురైన వారికి సమానత్వం కోసం అంకితమైన అల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ సంస్థ స్థాపనలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. 1937లో బీహార్ శాసనసభకు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. 1946లో జవహర్‌లాల్ నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో అతి పిన్న వయస్కుడైన మంత్రిగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. 1971 ఇండో–పాక్ యుద్ధ సమయంలో భారత రక్షణ మంత్రిగా సేవలందించారన్నారు. వ్యవసాయ మంత్రిగా హరిత విప్లవంతో వ్యవసాయాన్ని ఆధునికీకరించి దేశంలో ఆహార సంక్షోభాన్ని జయించడంలో కీలక పాత్ర పోషించారనిక కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి, సాంఘిక సంక్షేమ శాఖ ఏడీ అజయ్ బాబు పాల్గొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

నర్సీపట్నం: ఏలేశ్వరానికి చెందిన ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇరు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. రూరల్ ఎస్‌ఐ భీమరాజు అందించిన వివరాలు. ఏలేశ్వరానికి చెందిన కె.అఖిల(17), టి.ఆశోక్(25) నర్సీపట్నం మండలం కృష్ణాపురం వద్ద శుక్రవారం అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వారిని 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బంధువులు ఆస్పత్రికి చేరుకుని ప్రత్యేక అంబులెన్స్‌లలో కాకినాడ తీసుకువెళ్లి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రేమ జంట కన్ను మూసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భీమరాజు తెలిపారు.

నవశకం సంక్షేమ సంతకం



నర్సీపట్నంలో లబ్ధిదారులకు అందజేసిన టిడ్కో గృహాలు

టిడ్కో ▸ నాడు 0 నేడు 16,420



2019 మార్చి 20 నాటికి యలమంచిలిలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పరిస్థితి



ప్రస్తుతం యలమంచిలిలో పూర్తయిన టిడ్కో ఇళ్లు

ఇదీ తేడా..

టీడీపీ ప్రభుత్వం(2014-19)	వైఎస్సార్ సీపీ ప్రభుత్వం(2019-24)
ఇల్లు పేరుతో జనం జేబు గుల్ల చేసిన టీడీపీ	ఒక్క రూపాయికే 300 గజాల ఇల్లు రిజిస్ట్రేషన్
ఒక్క టిడ్కో ఇల్లు ఇవ్వకుండా కాలయాపన	ఇప్పటివరకు 16,420 ఇళ్లను అందజేసిన ప్రభుత్వం 90 శాతం సౌకర్యాలతో మరో 10 వేల ఇళ్లు పూర్తి
కనీస వసతులు కల్పించకుండానే ఎన్నికల ముందు హడావిడి	ప్రతి ఇంటినీ పక్కా నిర్మించి లబ్ధిదారులకు అందజేత
టీడీపీ వారికే ప్రథమ ప్రాధాన్యం	అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు కేటాయింపు
లబ్ధిదారులపై మోపిన భారం రూ.1284.02 కోట్లు	మాఫీ చేసిన మొత్తం రూ.1284.02 కోట్లు
ఇళ్ల నిర్మాణానికి చేసిన ఖర్చు రూ.354.55 కోట్లు	ఇళ్ల నిర్మాణానికి చేసిన ఖర్చు రూ.1004.37 కోట్లు

సాక్షి, విశాఖపట్నం/అనకాపల్లి/నర్సీపట్నం : కేంద్ర ప్రభుత్వ పథకం.. ఆపై రాష్ట్ర ప్రభుత్వ సహకారం.. రెండు కలిస్తే బంగారు కలల గృహం సొంతమవుతుందని ఎవరైనా భావిస్తారు. కానీ.. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం.. పేదల ఇళ్లల్లోనూ దోపిడీ పర్వాన్ని కొనసాగించింది. అప్పటి ధరల ప్రకారం అడుగు రూ.వెయ్యి కూడా చేయని ఇంటిని రూ.2 వేలకు అంటగడుతూ సొంత లాభం మిగుల్చుకునేందుకు కుతంత్రాలు పన్నింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ పోనూ మిగిలిన రుణభారం మొత్తం పేదలే భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఇళ్లలోనూ లబ్ధిదారుల ఎంపిక ఓ ప్రహసనంలా మార్చేసింది. పసుపు కండువా వేసుకున్న వారికే టిడ్కో ఇల్లు అన్నట్లుగా వ్యవహరించింది. దీంతో అసలైన లబ్ధిదారులకు సొంతింటి కల.. కలగానే మిగిలిపోయింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేల మంది సొంతింటి కలని నెరవేర్చింది. అరకొరగా ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను చురుగ్గా చేపట్టి లబ్ధిదారుల చేతికి తాళాలు అందించింది. ఓ వైపు నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు పేరుతో లక్షలాది మంది సొంతింటి కల నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్.. ప్రజా సంకల్పయాత్రలో మాట ఇచ్చినట్లుగా.. 300 చ.అడుగల ఇళ్లని ఒక్క రూపాయికే అందించి గొప్ప మనసు చాటుకున్నారు. గత ప్రభుత్వం లబ్ధిదారులపై మోపిన రుణభారాన్ని సైతం తగ్గించారు.

ఇల్లు పేరుతో దోపిడీ పర్వం

అర్బన్‌లో నివసించే ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలనే తలంపుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రవేశపెట్టిన పథకం అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టు. టిడ్కో పేరుతో రూ.6 లక్షలకు ఓ ఇల్లు చొప్పున నిర్మించి ఇస్తున్నారు. ఇందులో రూ.1.50 లక్షలు కేంద్ర ప్రభుత్వం, రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. రూ.3 లక్షలు లబ్ధిదారులు చెల్లించేలా పథకాన్ని రూపొందించారు. ఇందులో రూ.50 వేలు ముందుగా చెల్లిస్తే మిగిలిన రూ.3 లక్షలు లబ్ధిదారునికి బ్యాంకుల నుంచి రుణం అందించాలన్న నిబంధన విధించారు. ఆ అప్పును లబ్ధిదారుడే చెల్లించుకోవాల్సి ఉంటుంది. అదే దరఖాస్తుదారుడికి స్థలం ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2.50 లక్షలు రాయితీ ఇస్తాయే తప్ప.. బ్యాంకుకి సంబంధించిన రుణ బాధ్యతను అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకోలేదు. అయితే పేదలకు అందాల్సిన ఫలాల్లోనూ టీడీపీ నేతలు హస్తలాఘవం చూపించారు. బహుళ అంతస్తులుగా నిర్మిస్తున్న భవనాల్లో అసలైన లబ్ధిదారులకు మాత్రం చోటు లేకుండా.. పార్టీ కార్యకర్తలు, అనుయాయులకే ప్రాధాన్యమిచ్చారు.

టీడీపీ గుర్తింపు కార్డే అర్హత పత్రంలా..

దారిద్య్రరేఖకు దిగువన ఉండి, తెల్లరేషన్ కార్డుదారులు, ఇంతవరకూ ఎక్కడా ఇల్లు లేని వారు ఈ పథకానికి అర్హులు. కానీ తెలుగుదేశం హయాంలో ఈ పథకానికి అర్హత పొందాలంటే.. వారు టీడీపీకి చెందిన వారై ఉండాలి. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి ఉండేది. టీడీపీకి సంబంధించిన వారినే లబ్ధిదారులుగా గుర్తించారు. టీడీపీ ప్రభుత్వం అడ్డగోలుగా జీవో జారీ చేస్తూ.. ఎమ్మెల్యే, జన్మభూమి కమిటీల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేసే అధికారం కట్టబెట్టడంతో పథకం మొత్తం టీడీపీ కార్యకర్తల చుట్టూనే తిరిగింది.

నాడు ఒక్కటీ లేదు.. నేడు 16,420 అందజేత

ఉమ్మడి విశాఖ పరిధిలో 26,448 ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో 2019 వరకు 1000 ఇళ్లని లబ్ధిదారులకు కేటాయించామని చంద్రబాబు గొప్పలు చెప్పుకున్నారు. కానీ నీటి సౌకర్యం, రోడ్లు, మౌలిక వసతులేవీ కల్పించకుండా.. కేవలం టీడీపీ లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించి.. భుజాలు చరుచుకున్నారు. వాస్తవంగా చంద్రబాబు ప్రభుత్వం టిడ్కో ఇళ్లలో ఏ ఒక్కటి పూర్తి చేయలేకపోయింది. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక.. ప్రతి ఇంటికీ వీలైనంత త్వరగా సమగ్ర మౌలిక వసతులు కల్పించి అప్పగించాలని ఆదేశించారు. దీంతో ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసింది. చంద్రబాబు హయాంలో ఒక్కరంటే ఒక్కరికి పూర్తి సౌకర్యాలున్న టిడ్కో ఇంటిని అందివ్వలేకపోగా.. సీఎం వైఎస్ జగన్ హయాంలో ఏకంగా 16,420 మందికి ఇళ్లు కేటాయింపులు, గృహ ప్రవేశాలను పండగలా నిర్వహించారు. చంద్రబాబు హయాంలో ఉమ్మడి విశాఖలో టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం కేవలం రూ.354.55 కోట్లు మాత్రమే ఖర్చు చేసి మధ్యలోనే పనులు విడిచిపెట్టేశారు. కానీ.. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రూ.1004.37 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేశారు.

టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ ప్రతి ప్రాంతంలోనూ నిర్మాణాలను పర్యవేక్షించి.. అద్భుతంగా ఇళ్లను పూర్తి చేయించారు.

‘ప్రజా సంకల్ప యాత్ర’లో జగన్ అభయం

లబ్ధిదారులు ముందుగా రూ.50 వేలు చెల్లించాలి. మిగిలిన రూ.3 లక్షలకు రాష్ట్ర ప్రభుత్వం రుణం మంజూరు చేస్తుంది. ఈ రుణాన్ని చెల్లించాల్సింది లబ్ధిదారుడే. దీంతో ఈ గృహాలకు దరఖాస్తు చేసుకునేందుకు చాలా మంది వెనుకంజ వేశారు. 2018 జూలై వరకు గ్రేటర్ పరిధిలోని 8 నియోజకవర్గాల్లో 83,247 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఎప్పుడైతే అర్బన్ హౌసింగ్ పేరుతో చంద్రబాబు సర్కారు, ఎమ్మెల్యేలు చేస్తున్న దగాను ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండగడుతూ.. రుణాలపై అనుకూల ప్రకటన చేశారో.. అప్పటి నుంచి దరఖాస్తులు వెల్లువలా వచ్చిపడ్డాయి. రుణ భారాన్ని తమ ప్రభుత్వం వచ్చాక మాఫీ చేస్తామని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విశాఖలో ఆగస్టు 18న ప్రకటించారు. ఆ తర్వాత ఆరు నెలల్లోనే 1,44,589 దరఖాస్తులు వచ్చాయంటే.. జగన్ మాటకు ప్రజల్లో ఎంతటి విశ్వసనీయత ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేశారు.

పంపిణీకి సిద్ధంగా మరో 10,028 ఇళ్లు



అనకాపల్లి సత్యనారాయణపురంలో టిడ్కో ఇళ్ల సముదాయం

రుణ భారం దించేసిన జగన్ సర్కార్

ఇళ్లు తక్కువ ధరకే ఇస్తున్నామంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ప్రభుత్వం.. 300 చ.అడుగుల ఇంటిపై రూ.50 వేలు, 365 చ.అ. ఇంటిపై రూ.2.50 లక్షలు, 430 చ.అడుగుల ఇంటిపై రూ.3 లక్షల రుణభారాన్ని లబ్ధిదారులపై మోపింది. దీంతో.. ముందుగా డీడీలు చెల్లించిన వారంతా ఇల్లు రాక, రుణాలు తీర్చలేక అష్టకష్టాలు పడ్డారు. అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ జీవీఎంసీతో పాటు నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీల పరిధిలోని లబ్ధిదారులకు ఏకంగా రూ1284.02 కోట్లను మాఫీ చేసి.. వారి కళ్లల్లో వెలుగులు నింపారు.

అంశం	జీవీఎంసీ	యలమంచిలి	నర్సీపట్నం	మొత్తం
మంజూరైన టిడ్కో ఇళ్లు	24,192	432	1,824	26,448
టీడీపీ హయాంలో కేటాయించిన టిడ్కో ఇళ్లు	00	00	00	00
వైఎస్సార్ సీపీ హయాంలో అందజేసిన ఇళ్లు	14,832	432	1,156	16,420
నిర్మాణం పూర్తయిన ఇళ్లు	9,360	00	668	10,028
2014-19లో చేసిన ఖర్చు (రూ.కోట్లలో)	311.33	6.65	36.57	354.55
2019-24లో చేసిన ఖర్చు (రూ.కోట్లలో)	921.99	20.88	61.5	1,004.37
ప్రభుత్వం భరించిన రుణభారం(రూ.కోట్లలో)	1,175.63	20.71	87.67	1284.02

సొంతింటి కల నెరవేరింది



సొంతిల్లు ఏర్పర్చుకోవాలన్న మా కల సీఎం జగన్ మోహన్‌రెడ్డి చలవతో నెరవేరింది. గత ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహానికి దరఖాస్తు చేస్తే రూ.25 వేలు కడితేనే ఇల్లు ఇస్తామన్నారు. సీఎం జగన్ రూపాయికే టిడ్కో గృహం ఇచ్చి మా కుటుంబాన్ని ఆదుకున్నారు. నా భర్త సంపాదనతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ఇంటి అద్దె కట్టేందుకు చాలా ఇబ్బంది పడేవాళ్లం. జగనన్న దయవల్ల రూ.6.75 లక్షల విలువ చేసే టిడ్కో గృహం రావడం చాలా సంతోషంగా ఉంది. ఇటీవల ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఇంటి తాళాలు అందజేశారు. తాళాలు అందించిన రోజు మాఆనందానికి అవధులు లేవు.

– వైరాల షకీలా, పెదబొడ్డేపల్లి, నర్సీపట్నం

చాలా ఆనందంగా ఉంది



12 సంవత్సరాల కిందట నాకు వివాహం జరిగింది. అప్పటి నుంచి అనకాపల్లిలోని అద్దె ఇళ్లలో కాలం గడుపుతున్నాం. నా భర్త సూర్యనారాయణ మేస్త్రి పని చేస్తున్నారు. మాకు ఇద్దరు పిల్లలు. భర్త సంపాదించిన సొమ్ము కుటుంబ పోషణకే సరిపోతోంది. సొంత ఇల్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సొంత ఇంటి కోసం దరఖాస్తు చేశాం. అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో టిడ్కో ఇంటిని మూడు నెలల కిందట అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సొంత ఇంటి కల నెరవేరడంతో పాటు శ్రీకాకుళం జిల్లా శ్రీముఖలింగం నుంచి ఇక్కడకు వచ్చిన మాకంటూ ఒక అడ్రస్ దొరికింది. ఉచితంగా టిడ్కో గృహం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

–సీహెచ్ శ్రీ లక్ష్మి, అనకాపల్లి

పురవీధుల మెరిసే.. నూకాంబిక పూలరథం

- వేడుకగా కొత్త అమావాస్య జాతర మహోత్సవం



అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు రథాన్ని ప్రారంభిస్తున్న ఈవో బండారు ప్రసాద్

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమయింది. జాతరలో భాగంగా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి తెల్లవారుజాము నుంచే విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం రథంపై ఉంచి పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపును ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రారంభించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. అమ్మవారి మాలధారణ భక్తులు ఘటాలను తలపై ఉంచి, కొందరు శూలధారులై ఊరేగింపులో పాల్గొన్నారు. మాలధారణ సంఘం వ్యవస్థాపకుడు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. నేలవేషాలు, కోలాటం తదితర సాంస్కృతిక ప్రదర్శనలతో అమ్మవారి ఊరేగింపు శోభాయమానంగా జరిగింది.

ఏపీఎస్పీ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

గొలుగొండ: కృష్ణదేవిపేట గ్రామానికి చెందిన ఒక మహిళను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ఏపీఎస్పీ కానిస్టేబుల్ అడ్లబోయిన బాలరాజుపై కృష్ణదేవిపేట ఎస్‌ఐ ఉపేంద్ర కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. అడ్లబోయిన బాలరాజు సొంత గ్రామం కృష్ణదేవీ పేట. విశాఖ పరిధిలో ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. బాలరాజు కృష్ణదేవి పేటకు చెందిన ఒక మహిళను మూడు సంవత్సరాల నుంచి ప్రేమిస్తూ, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. బాలరాజు మోసం చేయడంతో కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. బాలరాజు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించింది. ఆమె ప్రస్తుతం నర్సీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గతంలో కూడా బాలరాజు లైంగిక వేధింపుల కారణంగా ఇద్దరు మహిళలు ఇబ్బందులు పడినట్టుగా ఆరోపణలు వచ్చాయని ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపారు.

7,8 తేదీల్లో పవన్ యాత్ర

సాక్షి, విశాఖపట్నం : జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నికల పర్యటన ఖరారైంది. వారాహి విజయయాత్ర పేరిట ఆయన ఎన్నికల సభలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. తొలుత ఈనెల 5 నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆయన పర్యటించాల్సి ఉంది. 5న అనకాపల్లి, 6న యలమంచిలి, 7న పెందుర్తిలో పవన్ సభలను నిర్వహిస్తారని పార్టీ నాయకులు షెడ్యూల్ విడుదల చేశారు. అయితే పిఠాపురం ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనకు జ్వరం సోకడంతో హైదరాబాద్ వెళ్లిపోయారు. దీంతో పవన్ పర్యటన వాయిదా వేశారు. తాజాగా ఈనెల 7న అనకాపల్లి, 8న యలమంచిలి నియోజకవర్గాల్లో పవన్ ఎన్నికల సభల్లో పాల్గొంటారని జనసేన కేంద్ర కార్యాలయం శుక్రవారం తెలిపింది. విశాఖ దక్షిణ, పెందుర్తి నియోజకవర్గాల్లో సభలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని పేర్కొంది.

70 మంది గ్రామ వలంటీర్ల రాజీనామా





రాజీనామా చేసిన నాతవరం జిల్లేడుపూడి వలంటీర్లు

నాతవరం: మండలంలోని నాతవరం, జిల్లేడుపూడి పంచాయతీలతో పాటు పలు గ్రామాలకు చెందిన 70 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో రాంబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఉసురు చంద్రబాబునాయుడు అండ్‌కోకు కచ్చితంగా తగులుతుందన్నారు. మేము సేవలందిస్తుంటే ప్రభుత్వానికి పేరురావడం చూసి ఓర్వలేక పింఛన్‌దారులపై ప్రతాపం చూపించడం దారుణమన్నారు. పోలింగ్ రోజున పింఛన్లుదారులు తమ ఓటుతో చంద్రబాబునాయుడుకు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

మత్స్యకారుల అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం





కొర్లయ్యపేట, పాల్మన్ పేట మత్స్యకారులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంబాల జోగులు, చిక్కాల రామారావు

పాయకరావుపేట: మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని మత్స్యకారుల కోసం పలు పథకాలు అమలు చేశారని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని కొర్లయ్యపేటకు చెందిన 30 కుటుంబాలు, పాల్మన్‌పేట కుచెందిన 20 కుటుంబాల టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పాల్మన్‌పేట సర్పంచ్ కోడ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చేరినవారికి అభ్యర్థి కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు యథాతథంగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. పాల్మన్‌పేట, కొర్లయ్యపేట గ్రామాలకు చెందిన కందాల జగన్నాథం, మైల్లపల్లి కాసులు, పెరుమాళ్ళ అమ్మోరయ్య, దూడ తాతారావు, పెరుమాళ్ళ త్రినాథ్, పెరుమాళ్ళ కొండయ్య, రాకతి సూరిబాబు, మైలపల్లి నూకరాజు, సింగిరి రమణ, దూడ తాతాబాబు తదితరులు మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్టు చెప్పారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ బోడిపల్లి శ్రీను, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి యజ్జల సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీకి షాక్

- వైఎస్సార్‌సీపీలో చేరిన కీలక నేత



ఎమ్మెల్యే గణేష్, సన్యాసిపాత్రుడు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన అజయ్, అతని అనుచరులు

నర్సీపట్నం: టీడీపీ అనుబంధ విభాగం టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రి సందీప్ సోదరుడు అజయ్ తన అనుచరులతో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, చింతకాయల సన్యాసిపాత్రుడు సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చడంతో పాటు ఎమ్మెల్యే గణేష్ వ్యక్తిత్వం నచ్చి పార్టీలో చేరానని అజయ్ పేర్కొన్నారు.

సి.ఎం.రమేష్‌ను కలవాలంటే

చార్టెడ్ ఫ్లైట్ కొనుక్కోవాల్సిందే

- టీడీపీ,బీజేపీ నాయకులకు దొరకని అపాయింట్‌మెంట్
- సామాన్యులకు అందుబాటులో ఎలా
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



విలేకర్లతోమాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

నక్కపల్లి: కూటమి తరపున అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సి.ఎం. రమేష్‌ను కలవాలంటే చార్టెడ్ ఫ్లైట్ కొనుక్కొని వెళ్లాలని, అంతటి స్థోమత అనకాపల్లి పార్లమెంట్ ప్రజలకు లేదని వైఎస్సార్‌సీపీ జిల్లాఅధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. అడ్డురోడ్డులో విలేకర్లతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇక్కడ ఎంపీగా పోటీచేస్తున్న సి.ఎం. రమేష్‌కు జిల్లా హద్దులు తెలియవన్నారు. ఎల్లలు తెలియని వ్యక్తిని ఎంపీగా పోటీ చేయించడం సిగ్గుచేటని చెప్పారు. బ్యాంకులను లూటీ చేసి అక్రమంగా సంపాదించిన సొమ్ముతో ఇక్కడ పోటీ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులకు కోట్లు కుమ్మరిస్తారనే ఉద్దేశ్యంతో పది జిల్లాల అవతల ఉన్న వ్యక్తిని తీసుకు వచ్చారని తెలిపారు. సామాన్యులకు అందుబాటులో ఉండని రమేష్‌కు ఓటేస్తే ఆత్మహత్యా సదృశ్యమే అవుతుందన్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు స్థానికేతరులను తరిమి కొడతారని చెప్పారు. ఎంతమంది కలిసి వచ్చినా వచ్చే ఎన్నికల్లో అధికారం వైఎస్సార్ సీపీదేనని, జగనన్న రెండోసారి ముఖ్యమంత్రికావడం తథమన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు బొలిశెట్టిగోవిందు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట బందోబస్తు



అచ్చెర్ల గ్రామ సభలో మాట్లాడుతున్న సీఐ వినోద్‌బాబు

కశింకోట: రానున్న ఎన్నికల్లో ఓటర్లంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ ఎం.వినోద్‌బాబు కోరారు. మండలంలోని అచ్చెర్లలో శుక్రవారం రాత్రి సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వివిధ కేసుల్లో ఉన్న వారు, అనుమానితులు, రౌడీ షీటర్లు సుమారు 350 మందిపై ఎన్నికల దృష్ట్యా బైండోవర్ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలన్నారు. ప్రధానంగా యువత ఎన్నికల వివాదాల్లో తలదూర్చి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

ఫ్రై.. డే



నిర్మానుష్యంగా కశింకోట ప్రధాన రహదారి

కశింకోట: వేసవి తాపం పెరిగింది. మండల ప్రజలు సూర్యతాపంతో శుక్రవారం ఉక్కిరిబిక్కిరయ్యారు. స్వల్పంగా వడ గాల్పులు కూడా వీచాయి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రంగా ఉంది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి సాహసించలేకపోయారు. అత్యవసర పనులు ఉన్న వారు మినహా మిగిలిన వారు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో కశింకోటలోని వీధులు, రోడ్లు జన సంచారం లేక వెలవెలబోయాయి.

10 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి: మద్యం క్వార్టర్ బాటిళ్లను తరలిస్తున్న కశింకోట మండలం కొత్తపల్లి బుచ్చయ్యపేటకు చెందిన టి.వెంకటగణేష్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ డి.రామకృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక పూడిమడక రహదారి పూల్‌బాగ్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వెంకటగణేష్ పది మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 4,405 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,850	4,310
మొదటి రకం	3,600	4,060
రెండో రకం	3,400	3,840
మూడోరకం	3,240	3,480

అనకాపల్లి సినిమాలు

భరతనాట్యం	: రాజా
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి)	: సత్యనారాయణస్క్రీన్-1
టిల్లు స్క్వేర్	: సత్యనారాయణస్క్రీన్-2
ఫ్యామిలీ స్టార్	: షిర్డిసాయి
ఫ్యామిలీ స్టార్	: పర్తిసాయి
మంజుమ్మల్ బాయ్స్	: వెంకటేశ్వర
ప్రేమలు	: శ్రీసత్య
టిల్లు స్క్వేర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 36 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 325 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 206 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

వారు కొట్టారు.. తట్టుకున్నాం
మేం కొట్టే దెబ్బను విపక్షాలు తట్టుకోలేవు

మండుటెండల్లో మమ్మల్ని ఇబ్బంది పెట్టాలనుకున్నారు. కష్టంగానైనా మేం భరించాం. మరో 40 రోజుల్లో మా టైం వస్తుంది. మేం కొట్టే దెబ్బకు విపక్షాలన్నీ కట్టగట్టుకుని మరీ బంగాళాఖాతంలో కలవక తప్పదు. ప్రధానంగా వ్యవస్థల అండతో ఆడుకోవాలనుకునే చంద్రబాబుకు మాత్రం దెబ్బ మామూలుగా ఉండదు. ఆయన కొడుకుకి రాజకీయ భిక్ష కోసం చేస్తున్న కుటిల మంత్రాంగాన్ని కూకటివేళ్లతో సహా పెకిలిస్తాం. ఫ్యాన్ గుర్తుకు నొక్కే రెండు బటన్లతో.. టీడీపీని, దాన్ని నమ్ముకుని అంటకాగుతున్న తోక పార్టీల్ని తుంగలో తొక్కేస్తాం.. ఇదీ గత మూడు రోజులుగా మండే ఎండల్లో సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలకు పరుగులు తీసి, పింఛన్లందుకున్న లబ్ధిదారుల మనోగతం.

- మరో 40 రోజుల్లో మా టైం వస్తుంది
- రెండు బటన్లు నొక్కుతాం.. కూటమిని తుంగలో తొక్కుతాం
- పింఛన్ల ఆటంకాలతో విపక్షాలపై లబ్ధిదారుల ఆగ్రహం



కశింకోటలోని అమరపల్లివీధిలో అనారోగ్య బాధితురాలి ఇంటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

కశింకోట: పింఛన్ లబ్ధిదారులు వరుసగా మూడో రోజు కూడా ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం ఎన్ని ఏర్పాట్లు చేసినా, మండు వేసవిలో కాలినడకన సచివాలయం, పంచాయతీ కార్యాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితికి కలత చెందారు. గ్రామ వలంటీర్లు ద్వారా ఇంటి వద్దే అందుకోవాల్సిన పింఛన్ కోసం ఇన్ని ఇక్కట్లు పడాల్సి రావడంతో అవ్వా తాతలు, వికలాంగులు వేదనకు గురయ్యారు. ఇందుకు కారణమైన చంద్రబాబు, ఆయన అనుయాయులపై శాపనార్థాలు పెట్టారు. తమకంటూ ఓ రోజు ఉందని, అది త్వరలోనే వస్తుందని, ఆ సమయంలో వీరందరికీ తగిన బుద్ధి చెప్తామని ఉద్ఘాటించారు. కశింకోట మండలంలోని 20 సచివాలయాల పరిధిలోని సిబ్బంది నడవలేని పింఛన్ లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. మండలంలో 10,665 పింఛన్లు ఉన్నాయి. వీటిలో 95 శాతం మేర పింఛన్లను మూడు రోజుల్లో పంపిణీ చేశారు. చాలా వరకు సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద లబ్ధిదారులు బారులు తీరి, పింఛన్లు అందుకున్నారు. దివ్యాంగులు, అనారోగ్యం, వృద్ధాప్యం తదితర కారణాలతో నడవలేని వారిని గుర్తించి, వారింటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. వలంటీర్లున్నపుడే తమకు చాలా సౌకర్యంగా ఉండేదని లబ్ధిదారులంతా ముక్త కంఠంతో స్పష్టం చేశారు. మండలంలో సుమారు 390 మందికి దాదాపు రూ.లక్షా 90 వేలు అభయ హస్తం పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. బ్యాంకు నుంచి నగదు అందుబాటులో లేక వీటి పంపిణీ పూర్తి కాలేదు. ఇవి తప్ప మిగిలిన పింఛన్ల పంపిణీ దాదాపు పూర్తయినట్లు ఎంపీడీవో శేషుబాబు తెలిపారు. మిగిలిన వారికి శనివారం పింఛన్ల సొమ్ము పంపిణీ చేస్తామన్నారు.

పని మానుకుని రావాల్సి వచ్చింది



నేను తోటమాలి పని చేస్తుంటా. దీని ద్వారా వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబ జీవనం కష్టంగా ఉండేది. జగన్ బాబు వచ్చాక పింఛన్ మొత్తం పెంచడం మాకు ఎంతో మేలు చేసింది. దానికితోడు ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే పింఛన్ డబ్బులు పట్టుకుని వలంటీర్ మా ఇంటికొచ్చేవారు. ఈ ప్రభుత్వంలో పింఛన్ కోసం ఒక్కనాడూ బయటకు వెళ్లలేదు. ఇప్పుడు వలంటీర్లపై అన్యాయంగా నిందలేసి ఆపేశారు. ప్రత్యేకంగా పింఛన్ కోసం పని మానుకుని వెళ్లాల్సి వచ్చింది. పని ముగించుకుని వచ్చే సమయానికి అధికారులుండరు. దీంతో వారింటికే వెళ్లి పింఛన్ తీసుకున్నా.

– పైల కాశీరావు, గవరపేట

వలంటీర్లను కొనసాగించాలి



నేను దివ్యాంగుడిని. వైకల్యం వల్ల కర్ర ఊత పట్టుకున్నా సరిగా నడవలేను. వంట చెరకు కొనుగోలు చేసి, దాన్ని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నా. ఇన్నాళ్లూ ఒకటో తేదీ తెల్లవారక ముందే ఇంటి దగ్గరికే వలంటీర్ వచ్చి పింఛన్ డబ్బులిచ్చేవారు. దీని వల్ల మాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేది. ఇపుడు వలంటీర్లను ఆపేయాలని ఎన్నికల సంఘం చెప్పిందట. వలంటీర్ల మీద చంద్రబాబే కేసు వేశాడట. మాకు ఇంతగా మేలు చేసే వలంటీర్లపై వీళ్లకు ఎందుకింత కక్షో తెలియట్లేదు. వలంటీర్లను మళ్లీ తీసుకోవాలి. వారి ద్వారా ఇంటి వద్దే పింఛన్ల అందించేలా చూడాలి.

– సర్ది రామునాయుడు, గవరపేట

నూకాలమ్మా.. నమోస్తుతే



రథంపై పలు వేషధారణలో చిన్నారులు

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, ఉత్తరాంధ్రుల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర శుక్రవారం శోభాయమానంగా ప్రారంభమయింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నేల వేషాలు, శూలాలతో అమ్మవారి మాలధారులైన భక్తుల మధ్య నూకాంబిక ఉత్సవ విగ్రహ ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది.

– అనకాపల్లి



కాళీమాత వేషధారులు



శూలాలతో నూకాంబిక మాలధారణ భక్తులు

వైఎస్సార్‌సీపీలో చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన ఉప్పిలి సత్యనారాయణ వర్గంతో పార్టీ నేతలు

అనకాపల్లి: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమల్లోకి వచ్చిందని, అందుకే విపక్ష పార్టీ అభిమానులు కూడా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి మలసాల నివేదిత అన్నారు. మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ పరిధిలో టీడీపీ మాజీ సర్పంచ్ ఉప్పిలి సత్యనారాయణ తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి ఆమె ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగాది తర్వాత పలు గ్రామాల నుంచి చాలా మంది వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చాక గ్రామాల్లో ప్రభుత్వ సేవలు అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటుచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి, సత్తిబాబు, ఎంపీటీసీలు నాగమణి, నాగేశ్వరరావు, కేఎల్‌ఎం నాయుడు, సీహెచ్ ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంగుపాం నాగేశ్వరరావు, పల్లా ముత్యాలు, పి.సుశీల తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ అధికారులపై దాడి గర్హనీయం



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి: ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు చెల్లించకుండా వ్యాపారం నిర్వహిస్తున్న చోడవరంలోని ఓ దుకాణంపై జీఎస్టీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుంటే బీజేపీ ఎంపీ అభ్యర్థి రమేష్ సదరు అధికారులపై దాడులకు పాల్పడటం అన్యాయమని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ ఆక్షేపించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్ను ఎగవేతదారులకు అండగా నిలిచి, నిబంధనలను ఉల్లంఘించి అధికారులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న రమేష్‌పై ఎన్నికల అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవిస్తున్నారని, ఎక్కడి నుంచో వచ్చి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వ్యక్తి, వ్యాపార దుకాణాలపై ఎందుకు దృష్టి సారిస్తున్నారని ప్రశ్నించారు. జిల్లాలో విధ్వంసాలను సృష్టించేలా ఆయన వైఖరి ఉందన్నారు. ఎన్నికల బరిలో ఉన్నపుడే ఇలా ఉంటే.. పొరపాటున గెలిస్తే జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వారికి రానున్న ఎన్నికల్లో ఓడించి, బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నిబంధనలను మీరి సుమారు 40 వాహనాలతో పూడిమడక జాతీయ రహదారి జంక్షన్ నుంచి నెహ్రూచౌక్ వరకు ప్రదర్శన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. దీనిపై ఎన్నికల అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఆర్.శంకరరావు, కాళ్ల తేలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

- ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్, అదనపు ఎస్పీ విజయభాస్కర్



గవరపాలెం పల్లపువీధిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్



ఎస్పీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ విజయ్‌భాస్కర్, కార్యాలయ సిబ్బంది

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎంపీ బీవీ సత్యవతి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా స్థానిక గవరపాలెం పల్లపువీధిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన రాష్ట్రం బీహార్‌లో జన్మించి, దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చి, కీలక పదవులను చేపట్టి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ నేతల స్ఫూర్తితో మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమను తాము మలచుకోవాలన్నారు. ఖాళీ సమయాల్లో గ్రంథాలయాలకు వెళ్లి, దేశ నేతల జీవిత చరిత్ర పుస్తకాలను చదవాలని సూచించారు. కార్యక్రమంలో 80, 81వ వార్డుల ఇన్‌చార్జిలు కొణతాల రామకృష్ణ, పీలా రాంబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, వివిధ దేవాలయాల చైర్మన్లు ఆళ్ల నాగేశ్వరరావు, ఎం.కె.నాయుడు, కొణతాల మురళీకృష్ణ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-2 వేగి త్రినాథ్, పార్టీ నేతలు దాడి నారాయణరావు, కాంగ్రెసుల యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

స్థానిక ఎస్పీ కార్యాలయంలో భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరానికి జగ్జీవన్‌రామ్ ఆదర్శనీయుడని కొనియాడారు. వివక్షకు గురైన అణగారిన వర్గాల సమానత్వం, సామాజిక న్యాయం కోసం నిస్వార్థ పోరాటాలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన మహనీయుడని పేర్కొన్నారు. అంటరానితనం రూపుమాపటంలో తన వంతు కృషిచేశారని తెలిపారు. ఆ మహనీయుని ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, సీఐ అప్పలనాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తుమ్మపాల గ్రామం ఇందిరానగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్‌కు చెందిన బలహీన వర్గాల కుటుంబంలో జన్మించిన జగ్జీవన్‌రామ్ అకుంఠిత దీక్ష, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించి బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, పార్టీ నేతలు పాల్గొన్నారు.
- ఇందిరానగర్ కాలనీలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ సభ్యుడు రేబాక మధుబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన జీవిత చరిత్రలో ప్రధాన అంశాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కట్టమూరి చిన్నారావు, శ్రీనివాసరావు, రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక చోడవరం బస్టాప్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి జైభారత్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కనిశెట్టి సురేష్‌బాబు, సీపీఐ జిల్లా నాయకులు వైఎన్ భద్రం, కోరిబిల్లి శంకరరావు, వివిధ ప్రజాసంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సంఘాల నేతలు బీఎస్పీ నాయుడు, సూదికొండ మాణిక్యాలరావు, రామకృష్ణ, శేఖరమంత్రుల సాయిలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరానగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మలసాల భరత్‌కుమార్



ఇందిరానగర్ కాలనీలో జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు



చోడవరం బస్టాప్ సమీపంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కనిశెట్టి సురేష్‌బాబు

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయండి

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



తుమ్మపాల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



కశింకోటలో బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని ధైర్యంగా చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని తుమ్మపాల గ్రామం కొత్తపేటవీధి, యాతపేట గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల్ని గెలిపించాల్సిందిగా కోరారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎన్నికల మ్యానిఫెస్టోను 99 శాతం అమలు చేసిందన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చేసి, పేద పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అట్టడుగు వర్గాల వారికి కూడా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనే ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతోపాటు, జిల్లాకు ఓ వైద్య కళాశాల, వాటికి అనుసంధానంగా సూపర్‌స్పెషాలిటీ బోధనాస్పత్రుల్ని స్థాపిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. తొలుత తుమ్మపాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుల ఇళ్లకు వెళ్లి, వారి కుటుంబ సభ్యులను భరత్‌కుమార్ కలుసుకున్నారు. పార్టీ తరఫున వారికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసానిచ్చారు. పార్టీ విజయానికి తద్వారా ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు సహకరించాల్సిందిగా అభ్యర్థించారు. అనంతరం తుమ్మపాలలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ప్రచారంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, అన్నపూర్ణ బ్యాంక్ డైరెక్టర్ పీడీ గాంధీ, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బూత్ కమిటీలతో సమావేశం

కశింకోట: రానున్న ఎన్నికలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ గడప గడపకూ వెళ్లి ముమ్మరంగా ప్రచారం చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి వెదురుపర్తి, కశింకోట గ్రామాలకు చెందిన బూత్ కమిటీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలో చేపట్టి అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. తద్వారా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు, అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ విజయానికి దోహదపడాలని కోరారు. ఎన్నికలకు చాలా తక్కువ సమయం ఉండటంతో ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు.